

అగళిలో పనిచేయని ఆర్వో ప్లాంట్



ఆలూడి పాఠశాలలో మూలపడిన ఆర్ఓ ప్లాంట్

కూటమి నిర్లక్ష్యం..

విద్యార్థులకు శాపం

- పాఠశాలల్లో పనిచేయని వాటర్ ప్లాంట్లు
- తాగునీటి కోసం అల్లాడిపోతున్న విద్యార్థులు
- పాలకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

అగళి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దింది. విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులన్నీ కల్పించింది. ఇందులో భాగంగానే మినరల్ వాటర్ అందించేందుకు ప్రతి పాఠశాలలో ఆర్వో ప్లాంట్ (వాటర్)ను ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటర్ ప్లాంట్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి పనిచేయడం లేదు. దీంతో తాగునీటి కోసం విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

పట్టించుకునే దిక్కే లేదు..

గత ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో రూ.లక్షలు ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పుడు అవి మూలనపడ్డాయి. అగళి మండలంలో 48 పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 34 ఉన్నాయి. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలు 3, ఉన్నత పాఠశాలలు 8 ఉన్నాయి. అందులో నాడు–నేడు కింద 41 పాఠశాలను ఎంపిక చేసి విద్యార్థుల సంఖ్యను బట్టి ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 17 వాటర్ ప్లాంట్లు ఒక్కో వాటర్ ప్లాంట్ ధర రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలతో ఏర్పాటు చేశారు. ఇందులో ప్రస్తుతం అందులో 8 ప్లాంట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. అలాగే మరో 23 ఆర్ఓ ప్లాంట్లను ఒక్కోటి రూ.30 వేల నుంచి రూ.70 వేలతో ఏర్పాటు చేశారు. ఇందులోనూ ప్రస్తుతం 9 మాత్రమే పనిచేస్తున్నాయి. వీటికి అయ్యే ఖర్చు భరించలేక ప్రధానోపాధ్యాయులు చేతులెత్తేశారు. కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కలుషిత నీటితో రోగాలు



వానాకాలం వస్తే చాలు పిల్లలను రోగాలు చుట్టుముడతాయి. కలుషిత తాగునీరు, ఆహారం వల్లే ఎక్కువగా రోగాల బారిన పడతారు. ఇంటి వద్ద నుంచి తీసుకెళ్లిన నీరు భోజనం వరకే ఉంటున్నాయి. ఆ తర్వాత కలుషిత నీరు తాగుతుండటంతో పిల్లలు అనారోగ్య బారిన పడుతున్నారు. స్కూల్‌లో ఉన్న ఆర్వో ప్లాంటుకు మరమ్మతు చేయించాలి.

– నూరుల్లా, అగళి

అనుమతి వచ్చాకే మరమ్మతు



కొన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. వాటికి మరమ్మతు చేపట్టాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి రావాలి. ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేసిన కంపెనీ ప్రతినిధుల దృష్టికి మరమ్మతుల విషయం తీసుకెళ్లినా స్పందన రాలేదు. విద్యాశాఖలోని ఉన్నతాధికారులకు విషయం చెబుతాం. వారి నుంచి అనుమతి రాగానే అవసరమైన మరమ్మతు చేపడతాం. అప్పటి వరకు సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్‌నాయుడు, ఎంఈఓ–2, అగళి

రైతులందరికీ వేరుశనగ అందకపోతే ఎలా?



మాట్లాడుతున్న ఎంపీపీ గంగమ్మ

సోమందేపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని రైతులందరికీ వేరుశనగ విత్తనకాయలు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో అన్నదాతలు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని ఎంపీటీసీ నాగప్ప, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, సర్పంచ్ జిలాన్‌ఖాన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వేరుశనగ విత్తకాయలు మరిన్ని కావాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపామని ఏఓ విజయ భారతి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ గంగమ్మ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈనెల 4న కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై ఆస్పత్రి పాలయ్యారని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అదేవిధంగా విద్యుత్, రెవెన్యూ సమస్యలకు సంబంధించిన సభ్యులు పలు విషయాలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపనకు ఆహ్వానం



వేణురెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని 21వ వార్డు మోతుకుపల్లిలో ఆగస్టు 3, 4 తేదీల్లో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు. ఇందులో భాగంగానే సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డికి మోతుకుపల్లి గ్రామస్తులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో హిందూపురం మున్సిపాలిటీ వింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, వార్డు ఇన్‌చార్జి న్యాతరెడ్డి, శ్రీకాంత్, నల్లయ్య, మితిలేష్ యాదవ్, నవీన్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ సోషియల్ మీడియా యాక్టివిస్ట్ వైఎస్ దాదు తండ్రి మహబూబ్‌బాషా అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి .. దాదు ఇంటికి వెళ్లి ఆయన తండ్రి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి.. దాదు తండ్రి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

వారంతా కాంగ్రెస్ కార్యకర్తలే..



రొళ్ల ఎమ్మార్సీలో కంప్యూటర్ ఆపరేటర్ (వృత్తం) గా ఉన్న వ్యక్తికి టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

రొళ్ల: మండల కేంద్రంతో పాటు హెచ్‌ఎం పల్లి, ఆర్.వద్రహట్టి, రొళ్ల ఎస్సీ కాలనీలో గత శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు 'సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికీ' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరికి టీడీపీ కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. రొళ్లకు చెందిన బాలకృష్ణ, బేల్దారి గంగాధర్, మహిళా నాయకురాలు నరసమ్మతో పాటు ఎమ్మార్సీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తి మిగిలిన ఐదారుగు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే. అయితే రొళ్ల మండలం నుంచి వైఎస్సార్‌సీపీకి చెందిన 15 కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీ పార్టీలో చేరారని సోషల్ మీడియాలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పోస్టు చేయడం హాస్యాస్పదంగా మారిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి విమర్శించారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వాస్తవాలు చెప్పాలని, ఇలాంటి దుష్ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. ఏడాది కూటమి పాలనలో ప్రజలు విసిగెత్తిపోయారని..రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లిన కూడా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు నీరాజనం పడుతున్నారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లు మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కేంద్ర బృందం ఆరా



సానిపల్లిలో కేంద్ర బృందం పర్యటిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లిలో స్వచ్ఛ సరేక్షణ్ గ్రామీణ్ – 2025 కేంద్ర బృందం సర్వే సభ్యులు రామాంజినేయులు, జిల్లా కోర్టు కోఆర్డినేటర్ సభ్యులు శ్రీనివాసులు, సాయినాథ్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పరిస్థితి, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ, ఇంకుడు గుంతలు నిర్మాణాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, వాటి ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ భేష్ అని సర్పంచ్ పరమేష్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శి, బాబు పాల్గొన్నారు.

సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై అవగాహన

మడకశిరరూరల్: మండలంలోని బుళ్లసముద్రం పంచాయతీ సమీపంలో సోమవారం సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై హైదరాబాద్‌కు చెందిన గ్రీన్ ఎనర్జీ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ మండలంలోని హరేసముద్రం, వైబీ హళ్లి, బుళ్లసముద్రం, మణూరు, కల్లుమర్రి, సీ కొడిగేపల్లి పంచాయతీల పరిధిలో భూమి కలిగిన రైతుల అంగీకారంతో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల లీజ్ అగ్రిమెంట్ మేరకు ఎకరాకు ఏడాదికి రూ.30 వేల చొప్పున రైతుకు చెల్లిస్తారన్నారు.

ఎస్ఎస్‌కే ఎన్నికల్లో 'సిండికేట్ గెలుపు



విజయం సాధించిన అభ్యర్థులు

పావగడ: స్థానిక ప్రతిష్టాత్మక ఎస్ఎస్‌కే (శని మహాత్మ కార్యనిర్వాహక) సంఘం ఎన్నికల ఫలితాలు సోమవారం విడుదల చేశారు. ఎన్నికల్లో సిండికేట్‌గా ఏర్పడిన 14 మంది అభ్యర్థులు విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన 11 మందిలో డా చక్కరరెడ్డి మాత్రమే గెలుపొందడం విశేషం. గెలిచిన అభ్యర్థుల్లో జీసీ అనిల్‌కుమార్, జీ అనిల్‌కుమార్, ఎస్ఆర్ అశ్వర్థకుమార్, ఆనందరావు, కృష్ణకుమార్, చక్కరరెడ్డి, మను, మోహన్‌కుమార్, రఘునంద్, రాజగోపాల్, విజయకుమార్, వెంకటరమణప్ప, వెంకటరామరెడ్డి, శ్రీనివాస్, సుబ్బనరసింహ ఉన్నారు.

వివిధ సమస్యలపై అర్జీలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్‌స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారం కోసం 13 అర్జీలు అందినట్లు ఆర్డీఓ ఆనందకుమార్ తెలిపారు.

వరుణుడి కరుణ కోసం..



అలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి



కోనేరు వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళేశ్వరస్వామికి సోమవారం కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, రైతులు సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వరుణ దేవుడి కటాక్షం కోసం భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకాన్ని నిర్వహించారు. అలాగే వరుణ యాగం, వరుణ జపం కూడా నిర్వహించారు. విరాటపర్వం పారాయణం కూడా చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు,రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

హిందూపురం: పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకానికి జిల్లా దేవదాయశాఖ అధికారి బి.నరసింహారాజు నోటిఫికేషన్ విడుదల చేశారు. ధర్మకర్తల మండలి నియామకానికి కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిగల వారు 20 రోజుల్లోపు దరఖాస్తులను భర్తీచేసి జిల్లా దేవదాయశాఖ అధికారి ఆఫీసులో అందజేయాలన్నారు.

ధ్యాన తరగతులు ప్రారంభం

హిందూపురం: ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో పాన్ ఇండియా ఆనంద ఉత్సవం హ్యాపీనెస్ ప్రోగ్రాం సోమవారం ఎస్‌డీజీఎస్ కళాశాల సెమినార్ భవన్‌లో ప్రారంభమైనట్లు సభ్యులు మనోజ్ తెలిపారు. కార్యక్రమంలో సుదర్శన క్రియ, ప్రాణాయామ ధ్యానం, సాధన వంటి ధ్యాన తరగతులు వాటి ఉపయోగాలు తెలియజేశారు. యోగ, ధాన్య కార్యక్రమాలు సోమవారం నుంచి ఆదివారం 20 వరకు రోజూ ఉదయం 6 నుంచి, సాయంత్రం 6 నుంచి ఉంటాయన్నారు.

విజయోత్సవ సభను జయప్రదం చేయండి

మడకశిర: విజయవాడలో ఈనెల 17న నిర్వహించనున్న మాదిగల విజయోత్సవ సభకు సంబంధించిన కరపత్రాలను సోమవారం దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతు, మాదిగ దండోరా నాయకులు అంజి, నరసింహ, మారెప్ప, మారుతీ, సత్య విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య అధ్యక్షతన సభ జరుగుతుందని పేర్కొన్నారు. మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంబేడ్కర్ స్మృతివనం పరిశీలన

అమరాపురం: స్థానిక మడకశిర రోడ్డులో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ స్మృతి వనాన్ని తహసీల్దార్ లక్ష్మీ నరసింహ సోమవారం పరిశీలించారు. ఈ స్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని మండలంలోని దళితులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే డిజిటల్ గ్రంథాలయం, ప్రహరీ నిర్మాణం చేయనున్నట్లు దళిత నాయకులు తెలిపారు. దీంతో తహసీల్దార్ ఆ స్థలాన్ని సందర్శించారు.

చీటింగ్ కేసు నమోదు

హిందూపురం: తెనాలికి చెందిన లక్ష్మణకుమార్ తను మోసం చేశారంటూ హిందూపురంలోని ఎంఎఫ్ సర్కిల్‌లో నివాసముంటున్న వ్యాపారి గోపాల్‌రెడ్డి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతినెలా సరుకుల కొనుగోలు కోసం రూ.5 వేలు పంపుతుండేవాడినని, ఈసారి కూడా డబ్బులు పంపినా సరుకులు పంపలేదన్నారు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఇరువురిపై కేసునమోదు

స్థానిక బోయపేటకు చెందిన అన్నదమ్ములు లక్ష్మీనారాయణ, శివ ఆస్తి పంపకాల విషయంలో గొడవ పడటంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

చెత్త సేకరణ పరిశీలన

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ రామరావు తెలిపారు. సోమవారం మండలంలోని హేమావతిలో నిర్వహిస్తున్న ఇంటింటా పొడి, తడి చెత్తను ట్రైసైకిల్‌లో సేకరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతీ ఒక్కరూ రోడ్డులో చెత్త వేయకుండా చెత్త సేకరణ సిబ్బంది వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: పట్టణంలోని శ్రీకంఠపురం ఝాన్సీ లక్ష్మీబాయి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న ఐటీఐకి రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి మురళీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటర్ మెకానిక్, సివిల్, డీజిల్ మెకానిక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హులైన వారు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తుల సమర్పించుకోవాలన్నారు.

బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ

పెనుకొండ రూరల్: నియోజకవర్గంలో బూత్ లెవల్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని 265 మంది బూత్ లెవెల్ అధికారులకు ఈ నెల 10 నుంచి 17 వరకూ రోజుకు 44 మందికి చొప్పున ఒక్కో రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఓటరు నమోదు, జాబితా సవరణ, ఇంటింటి సర్వేలపై తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కల్పించినట్లు ఆర్డీఓ ఆనంద్ కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



మోహన్‌కుమార్‌ను సన్మానిస్తున్న అనంతరాజు

రొళ్ల: మడకశిర పట్టణ సమీపంలోని బేగార్లపల్లి క్రాస్ వద్ద దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న కుంచిటి వక్కలిగ సముదాయ భవనం నిర్మాణానికి వైబీ హళ్లి పంచాయతీ కోడిపల్లికి చెందిన మోహన్‌కుమార్ రూ.లక్ష విరాళాన్ని అందజేసినట్లు కుంచిటి వక్కలిగ సంఘం తాలూకా అధ్యక్షుడు బి.అనంతరాజు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా సంఘం బ్యాంక్ ఖాతాను జమ చేశారన్నారు. దీంతో సంఘం తరుపున మోహన్‌కుమార్‌కు శాలువ కప్పి, పూలమాల వేసి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

వెంటనే జీతాలు చెల్లించండి

పెనుకొండ: బదిలీ ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఏపీ స్కూల్ ఫెడరేషన్ చైర్మన్ కాడిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.

సోమందేపల్లిలో కార్డెన్ సెర్చ్



ఓ ఇంటి దగ్గర విచారిస్తున్న పోలీసులు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో సోమవారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మండలంలో గంజాయి రవాణాపై గట్టి నిఘా ఉంచామని, ఇందులో భాగంగా 10 అనుమానాస్పద ఇళ్లలో తనిఖీలు చేపట్టామని సీఐ రాఘవన్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మట్కా, పేకాట లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రమేష్ బాబు, నరేంద్ర, రంగుడు యాదవ్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రంగనాథస్వామి ఉత్సవాలు



అలంకరణలో కాలువ రంగనాథస్వామి

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెర గ్రామ సమీపంలో వెలసిన కాలువ రంగనాథస్వామి ఉత్సవాలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి మూల విగ్రహానికి అంకురార్పణ, మహాపూర్ణాహుతి, కలశ విసర్జన, వసంతోత్సవం, ధ్వజారోహణ చేసి మహామంగళారతి ఇచ్చారు.

దోషులను శిక్షించండి



ఆందోళనలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పావగడ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి అవహేళనగా మాట్లాడిన దోషులను కఠినంగా శిక్షించాలని స్థానిక బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయం వద్ద సోమవారం వారు ఆందోళన నిర్వహించారు. బీజేపీ తాలూకా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ రాధమ్మతో పాటు మరికొందరి మధ్య సాగిన సంభాషణ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిందన్నారు. ఇందులో ఓ వ్యక్తి పీఎం మోదీని హీనంగా మాట్లాడారన్నారు. వారిపై చర్య తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ వరద రాజుకు వినతిపత్రం అందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించి సీఐ సురేశ్‌కు ఫిర్యాదు చేశారు.

హిందీ పండిట్‌ను నియమించండి

హిందూపురంటౌన్: హిందూపురం మండలం తూమకుంట చెక్‌పోస్టు వద్ద పొట్టకూటి కోసం వలస వచ్చి స్థిరపడిన బీహార్, యూపీ, ఎంపీ రాష్ట్రాలకు చెందిన కార్మికుల పిల్లలు విద్యాబోధన అందించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో తహసీల్దార్ కార్యాలయంలో వినతిప్రతాన్ని అందించారు. తూమకుంట పాఠశాలలో దాదాపు వంద మంది వలస కార్మికుల పిల్లలు ఉన్నారని, పాఠశాలలో హిందీ టీచర్ లేని కారణంగా పిల్లలు స్కూల్‌కు వెళ్లడం లేదన్నారు. వెంటనే హిందీ టీచర్ నియమించాలని డిమాండ్ చేశారు.

నీటి సమస్యను పరిష్కరించండి



తహసీల్దార్ సుబ్బరావుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అగళి: మండలంలోని ప్రజలకు ప్యూరిఫైడ్ వాటర్ అందక రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ సుబ్బారావుకు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో 18 శుద్ధ వాటర్ ప్లాంట్ల ద్వారా నీళ్లు అందించారని, రెండు నెలలుగా ఫిల్టర్ వాటర్ అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఒక్కో బిందెకు రూ.15 నుంచి రూ.20 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ తాగునీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, సర్పంచ్ ముద్దరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మధు, హనుమంతరాయప్ప, నాగరాజు, పవన్, లింగరాజు, గోవిందప్ప, నాగేంద్ర, కొండనాగరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


సూపర్ సిక్స్ పథకాలు గాలికి..



మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

లేపాక్షి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ మండిపడ్డారు. సోమవారం ఉదయం మండల కేంద్రమైన లేపాక్షిలోని పిల్లిగుండ్లకాలనీలో మండల కార్యదర్శి శివప్ప అధ్యక్షతన జరిగిన సీపీఐ మండల కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్ హామీలను గాలికొదిలేసిందన్నారు. అరకొరగా అమలు చేస్తున్న పథకాల్లోనూ అనేక కొర్రీలు పెడుతున్నారే తప్ప సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఈ ప్రభుత్వం అప్పులు చేయడమేగాని.. పేద ప్రజలకు చేసిన మేలు ఏమీలేదని విమర్శించారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గౌతమ్‌కుమార్, సహాయ కార్యదర్శిలుగా నాగరాజు, వెంకటేశులను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట హర చతుర్థి



అలంకరణలో మహా గణపతి

హిందూపురం: సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకుని సోమవారం మహా గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని శ్రీనివాసనగర్, బెంగళూరురోడ్‌లోని గణపతి ఆలయంలో ఉదయం, సాయంత్రం మూలవిరాట్ మహాగణాధిపతికి పంచమృతాభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులతో గణపతి ఆలయాలలో భక్తులతో కిటకిటలాడాయి.